RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 25 నవంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 196 | పేజీలు: 4 | వెల: రూ.5/-

## భారత్‌లో ఎన్నికల ప్రక్రియపై ఎలాన్ మస్క్ ప్రశంసలు

### అమెరికాకు చురకలు



**వాషింగ్టన్: (ప్రభాత సూర్యుడు):** ప్రపంచ కుబేరులలో ఒకరైన ఎలాన్ మస్క్ తనకు తోచిన విషయాన్ని నిర్మొహమాటంగా బయటకు వెల్లడించే తరహా వ్యక్తి. ఈ క్రమంలో అమెరికా ఎన్నికలతో పోల్చి, భారత ఎన్నికల ప్రక్రియపై స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ప్రశంసల జల్లులు కురిపించారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఇంకా ఓట్ల లెక్కింపు జరుగుతోంది. వారాలు గడుస్తున్నా

..మిగతా 2లో



## ప్రభుత్వ ఏర్పాటుకు 'మహా'యుతి సిద్ధం

### సీఎం అభ్యర్థిపై వీడని ఉత్కంఠ!

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** మహారాష్ట్రలో తిరుగులేని విజయం సాధించిన బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. సోమవారమే ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగే అవకాశముందని శిందే వర్గం శివసేన నేత దీపక్ కేసర్కార్ వెల్లడించారు. సీఎంతో పాటు ఆయన డిప్యూటీలు ప్రమాణ స్వీకారం చేసే అవకాశముందని తెలిపారు. అయితే, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్, ఏక్‌నాథ్ శిందే సీఎం రేసులో ముందున్నట్లు వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర శాసన సభ గడువు మంగళవారంతో పూర్తికానుంది. గెలిచిన కూటమి 72 గంటల్లోగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. లేదంటే రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వ ఏర్పాటుకు మహాయుతి వేగంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

**ముఖ్యమంత్రి పీఠం ఎవరిదంటే?**

మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరో మహాయుతి నేతలు, బీజేపీ నాయకత్వం నిర్ణయిస్తుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారని అన్నారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోల్ కూడా కేవలం 200 ఓట్ల మెజారిటీతో గెలిచినట్లు గుర్తు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి 234 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ 46 స్థానాలకే పరిమితమైంది. మహారాష్ట్రలో అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చారని చంద్రశేఖర్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదా ఇప్పుడు ఏ పార్టీకీ దక్కదని అందుకు కాంగ్రెస్ వైఖరే కారణమని విమర్శించారు. మహారాష్ట్ర

..మిగతా 2లో

## 29న జిల్లా కేంద్రాల్లో దీక్షా దివస్

### తెలంగాణ చరిత్రలో ఉద్యమనేత, మాజీ సీఎం కేసీఆర్‌ది చెరగని ముద్ర

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** కాంగ్రెస్ కబంధహస్తాల నుండి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కాపాడుకోవాలని మరో సంకల్ప దీక్ష చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అని ప్రొఫెసర్ జయశంకర్ చెప్పిన మాటలను కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ చరిత్రలో ఉద్యమనేత, మాజీ సీఎం కేసీఆర్‌ది చెరగని ముద్ర అని అన్నారు. . 2009 నవంబర్ 29వ తేదీ.. కేసీఆర్ దీక్షతో తెలంగాణ ఉద్యమం మలుపు తిరిగిందన్నారు. కేసీఆర్ దీక్ష తెలంగాణపై చెరగని ముద్ర వేసిందని గుర్తు చేశారు. నవంబర్ 29వ తేదీన 33 జిల్లా కేంద్రాల్లో దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఏప్రిల్ 27, 2001 నాడు గులాబీ జెండాను ఎగరవేసిన నాయకులు కేసీఆర్ అని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని మలుపు తిప్పి.. 60 ఏళ్ల తెలంగాణ ఉద్యమ చరిత్ర పై కేసీఆర్ చెరిగిపోని సంతకం చేసిన మహానాయకుడు అని కొనియాడారు. మహోజ్వల ఉద్యమానికి మలుపు

..మిగతా 2లో

### అది నోరైతే నిజాలు వస్తాయి

అదే మూసీ అయితే..

సీఎంపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

2లో..

## ఈ రోజు ఎంతో ప్రత్యేకం

### ఎన్‌సీసీలో తన అనుభవాలను గుర్తుచేసుకున్న మోదీ



**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** నేడు ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ తన అనుభవాలను పంచుకున్నారు. దిల్లీ: యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాతత్వాన్ని పెంపొందించడంలో ఎన్‌సీసీ ప్రముఖ పాత్ర వహిస్తుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఆదివారం ప్రసారమైన 116వ 'మన్ కీ బాత్'ఎపిసోడ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్‌సీసీ డే సందర్భంగా మాట్లాడిన ఆయన.. తాను క్యాడెట్‌గా ఉన్న సమయంలోని అనుభవాలను గుర్తు చేసుకున్నారు. "ఈ రోజు ఎన్‌సీసీ దినోత్సవం. ఇది ఎంతో ప్రత్యేకమైన రోజు. ఎన్‌సీసీ పేరు వినగానే మనందరికీ మన కాలేజీ, అలనాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తుంటాయి. నేను కూడా ఎన్‌సీసీ క్యాడెట్‌నే. ఆ సమయంలో నేను పొందిన అనుభవం నాకెంతో అమూల్యమైంది. పూర్తి

..మిగతా 3లో

## మెట్రో రైల్‌ను పటాన్‌చెరు నుంచి ఇస్నాపూర్ వరకు పొడిగించాలని వెల్లువెత్తుతున్న విజ్ఞప్తులు

- పటాన్ చెరువు నుండి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును పొడిగించాలని తెరలేపనున్న ప్రజా సంఘాలు, సామాజిక ఉద్యమకారులు
- మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, పటాన్చెరు శాసనసభ్యులు గూడం మహిపాల్ రెడ్డి లు చురుకైన పాత్ర పోషించక తప్పదు
- పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ఏకం
- మళ్లీ మెట్రో రైల్ సాధన సమితి కన్వీనర్ కస్బా శంకర్ రావు మెట్రో సాధనకై క్రియాశీలక పాత్ర
- ముత్తంగి, ఇస్నాపూర్, రుద్రారం గ్రామాల పెద్దలతో 'కస్బా' సమాలోచనలు



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** ఎన్నో పోరాటాలు, రాస్తారోకోలు, సంతకాల సేకరణలు, పాదయాత్రలు, లక్షల కరపత్రాల ప్రచారాలు, ప్రజా ప్రతినిధుల కు విన్నపాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు రాతపూర్వక విజ్ఞప్తులు, భారత రాష్ట్రపతి కి సామూహిక ఉత్తరాల విజ్ఞప్తిలతో ఎంతో శ్రమ ఓర్చి, మెట్రో రైల్ ను మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు పొడిగించాలని గ్రేటర్ హైదరాబాద్ సమస్యల సాధన సమితి కన్వీనర్ కస్బా శంకర్రావు సారథ్యంలో ఇతర మిత్రుల సహకారంతో మెట్రో రైల్ ను మియాపూర్ నుంచి పటాన్చెరువుకు పొడిగించాలని చేసిన కృషి తో సాధించుకున్న విషయం ప్రాంత ప్రజలకు విధితమే. తాజాగా పటాన్ చెరువు నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో ను పొడిగించాలని ఉవ్వెత్తున వస్తున్న విజ్ఞప్తులకు అందుకు కారణాలు లేకపోలేదు. ముత్తంగి, ఇస్నాపూర్, రుద్రారం జాతీయ రహదారి 65 ఆయా ప్రాంతాల ఇల్ల మధ్యల నుంచి వెళు తుండడం, ఆయా ప్రాంతాల చుట్టూ ఇంజనీరింగ్

..మిగతా 2లో

## అబద్ధాలు చెప్పడంలో సీఎం రేవంత్‌కు PHD ఇవ్వాలి: హరీష్ రావు



**కరీంనగర్, (ప్రభాత సూర్యుడు):** ఆరు గ్యారంటీల మోసాన్ని గ్రహించి మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఓడించారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు, సీఎం రేవంత్ రెడ్డి కళ్ళు తెరిచి బుద్ధి తెచ్చుకోవాలని, వందరోజుల్లో అమలు చేస్తామన్న 6 గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాండ్ పేపర్ మీద రాసిచ్చి, దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి ప్రజలను మోసం చేశారని.. అబద్ధాలు చెప్పడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పీహెచ్డీ ఇవ్వాలని సెటైర్ వేశారు. 2024, నవంబర్ 24న కరీంనగర్‌లోని హుజురాబాద్‌లో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. హుజురాబాద్‌లో 18500 మందికి కేసీఆర్ దళిత బంధు మంజూరు చేశారని.. వీరిలో కొందరికి ఆగిపోయిన ఐదు లక్షలు ఇవ్వమంటే వారిపై

..మిగతా 3లో

## డేటా ఎంట్రీనే కీలకం..

### చివరి దశకు సమగ్ర కుటుంబ సర్వే.



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుంది. డేటా ఎంట్రీ దశ చాలా ముఖ్యమై నది. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకండి' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్ర మార్క అధికారులను ఆదేశించారు. ఉదయం ఆయన జారండ్ రాజధాని రాంచీ నుంచి సమగ్ర కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లుకు పలు సూచనలు చేశారు. సర్వేదశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపో వడం వంటి కొన్ని సమస్యలు తలెత్తా యన్నారు. కాబట్టి

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు

### నటుడు అలీకి నోటీసులు



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** టాలీవుడ్ యాక్టర్ అలీకి వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం ఎక్‌మామిడి పరిధిలో వ్యవసాయ భూమి ఉంది. ఆయన ఫ్యామిలీతో కలిసి తరుచుగా అక్కడకు వెళ్తుంటారు. అక్కడ తాజాగా పర్మిషన్ లేకుండా ఫామ్ హౌస్ నిర్మాణాలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు అందాయి. దీంతో అలీకి గ్రామ కార్యదర్శి శోభారాణి నోటీసులు జారీ చేశారు. నిర్మాణాలు ఆపివేయాలని సూచించారు. ఎక్‌మామిడి రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 345లోని ఫామ్‌హౌస్‌లో నిర్మాణాలకు సంబంధించి డాక్యూమెంట్స్ సబ్మిట్ చేసి పర్మిషన్స్ తీసుకోవాలని ఈ నెల 5న అలీకి నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఆయన రెస్పాండ్ కాకపోవడంతో మరోసారి పంచాయతీ కార్యదర్శి నోటీసులు ఇచ్చారు. సంబంధిత డాక్యూమెంట్స్ సమర్పించి అనుమతులు పొందాలని సూచించారు. లేని పక్షంలో పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు. వ్యయసాయ క్షేత్రంలో పని చేసే వారికి నోటీసులు అందించామని సెక్రటరీ తెలిపారు. ఈ నోటీసులు అందుకున్న నేపథ్యంలో అలీ కూడా రిప్లై ఇవ్వడానికి రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది.

# 29న జిల్లా కేంద్రాల్లో దీక్షా దివస్

**మొదటి పేజీ తరువాయి...**

తిప్పిన రోజు2009, నవంబర్ 29న కేసీఆర్ నిరాహార దీక్ష మహోజ్వల ఉద్యమాన్ని మలుపుతిప్పిన రోజు అని కేటీఆర్ చెప్పారు. నవంబర్ 29, 2009 స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే శుభదినమన్నారు. మూడు కోట్ల తెంగాణ ప్రజలు ముక్త కంఠంతో మా తెలంగాణ మాకు కావాలని నినదించారు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ తెచ్చుడో అని తెగువను ప్రదర్శించిన నాయకుడికి అండగా నిలబడ్డారు. అందర్నీ మెప్పించి ఒప్పించి, దేశ రాజకీయ వ్యవస్థను, రాష్ట్రంలో ఉండే రాజకీయ వ్యవస్థను కులమతాలకు అతీతంగా కలిపింది దీక్షా దివస్ అని కేటీఆర్ గుర్తు చేశారు.

**ఘనంగా దీక్షా దివస్**

ఈ నెల 29న 33 జిల్లా పార్టీ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వం.. ఉద్యమంలో కానీ, పరిపాలనలో కానీ చెరగని ముద్ర వేసిందన్నారు. రెండు జాతీయ పార్టీలకు బుద్ధి చెప్పే విధంగా కదం తొక్కుతామన్నారు. 29న దీక్షా దివస్‌తో పార్టీ శ్రేణులు కదం తొక్కాలని విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాలకు సీనియర్ నాయకులను ఇంచార్జిలుగా నియమించామని, ఈ నెల 26న ప్రతి జిల్లాలో ముఖ్య నాయకులు కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు. డిసెంబర్ 9న మేడ్చల్ తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణతో దీక్షా దివస్ ముగిస్తామని తెలిపారు. తెలంగాణ తల్లికి ప్రణమిల్లుతూ ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,



ఎంపీలు అందరూ పాల్గొంటారని కేటీఆర్ తెలిపారు.

**29న నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం**

ఈ నెల 29న దీక్షా దివస్ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని, ఇందులో భాగంగా నిమ్స్ హాస్పిటల్ లో అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు కేటీఆర్ తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో నిమ్స్ హాస్పిటల్ పాత్ర కూడా ఎంతో ఘనమైందని, నాడు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్‌కు తరలించడంతో అక్కడ కదన రంగంగా మారిపోయందని గుర్తు చేశారు. మలిదశ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిన నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామని కేటీఆర్ తెలిపారు.

**కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి కాపాడుకుందాం**

సమైక్య రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ పాలనలో ప్రతి వర్గం, ప్రతి మనిషి బతుకు చిద్రమైన పరిస్థితి ఏర్పడిందని, మళ్లీ ఇవాళ ఆ పరిస్థితితులు తిరిగి కనబడుతున్నాయని అన్నారు. అదే నిర్బంధం, అదే అణిచివేత, అవే దుర్భర పరిస్థితులు, ఆందోళనకరమైన పరిస్థితి కనబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో నేడు మళ్లీ రెండు ఢిల్లీ పార్టీ మెడలు వంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తిరిగి తెలంగాణలో బతుకు అంధకారమైందని అన్నారు.

## అది నోరైతే నిజాలు వస్తాయి

హైదరాబాద్: రేవంత్ రెడ్డి.. నరం లేని నాలుక ఏదైనా మాట్లాడుతుంది. అది నోరైతే నిజాలు వస్తాయి.. అదే మూసీ అయితే మాయమాటలే వస్తాయి” అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. “పిల్ల చేష్టలు, గారడీ మాటలు, లక్ష్యం లేని చర్యలతో రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నావ్” అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు. “నీ ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ కొడంగల్ లో భూసేకరణ ఫార్మా విలేజ్‌ల కోసం అని స్పష్టంగా వెల్లడిస్తుంది. ఫార్మా క్లస్టర్ ఏర్పాటు చేస్తామని పలు మార్లు, పలు వేదికల మీద ప్రకటనలు చేస్తివి. తొండలు గుడ్లు పెట్టని భూములు అంటూ బాతాఖానీ కొడితివి. మీ అన్న తిరుపతి లగచర్ల చుట్టుపక్కల గ్రామాలలో తిరిగి ప్రైవేటు సైన్యంతో, పోలీసు బలగాలతో కలిసి భూములు ఇవ్వాలని రైతులను బెదిరించలేదా?. ఎదురు తిరిగిన రైతుల మీద అక్రమ కేసులు పెట్టి,జైళ్లకు పంపి అక్రమ నిర్బంధం, అణచివేత కొనసాగించడం లేదా?” అని కేటీఆర్ ప్రశ్నలు గుప్పించారు. “ఇంత చేస్తూ ఇప్పుడు అక్కడ పెట్టేది ఫార్మా సిటీ కాదు.. ఇండస్ట్రియల్ కారిడార్ అంటూ మాటమార్చి ఎవర్నీ పిచ్చోళ్లను చేస్తున్నావ్. చెప్పెటోడికి వినేవాడు లోకువ అన్నట్లు అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన నువ్వు అబద్ధాలతోనే కాపురం చేస్తూ కాలం వెల్లదీస్తున్నావు” అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

### భారత్‌లో ఎన్నికల ప్రక్రియపై
## ఎలాన్ మస్క్ ప్రశంసలు

**మొదటి పేజీ తరువాయి...**

కాలిఫోర్నియాలో ఇంకా ఓట్ల లెక్కింపు పూర్తికాకపోవడంపై ఎలాన్ మస్క్ ఘాటుగా స్పందించారు. భారత్ లో కొన్ని నెలల కిందట సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అయితే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఒక్కరోజులోను ముగిస్తుంది భారత ఎన్నికల సంఘం. ఈ విషయంపై భారత్‌లో 640 మిలియన్ల ఓట్లను ఒక్కరోజులోనే ఎలా లెక్కించారు?’ అనే హెడ్‌లైన్‌తో పబ్లిష్ అయిన వార్తను వి ద పీపుల్ పాపులిజం ఇన్ డెమోక్రసీ అనే పేజీలో పోస్ట్ చేశారు. చీటింగ్ అనేది వారి లక్ష్యం కానప్పుడు ఎన్నికల ప్రక్రియ ఇలా ఉంటుంది అనే ఆ పోస్ట్ సారాంశం. దీనిపై ఎలాన్ మస్క్ స్పందించారు. భారత్ ఒక్క రోజులోనే 640 మిలియన్ల ఓట్లను లెక్కించారు. కానీ, కాలిఫోర్నియాలో మాత్రం ఇంకా ఓట్ల లెక్కింపు పూర్తి కాలేదు అని ఎలాన్ మస్క్ ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. చేతితో తల పట్టుకున్నట్లు ఎమోజీ కూడా పోస్ట్ చేయడంతో మస్క్ ట్వీట్ వైరల్ అవుతోంది.

## ప్రభుత్వ ఏర్పాటుకు ‘మహా’యుతి సిద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హెూదా దక్కాలంటే కనీసం 29 స్థానాలు నెగ్గాలి. విపక్ష పార్టీల్లో ఏ పార్టీకి కూడా ఆ స్థాయిలో సీట్లు రాలేదు.

**ఆయనకు ఉపముఖ్యమంత్రి పదవి?**

మహారాష్ట్రలో మహాయుతి ఘన విజయం సాధించడంతో కూటమిలోని అగ్రనాయకు లకు ఏ పదవులు దక్కుతాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఏక్‌నాథ్ శిందేకు డిప్యూటీ సీఎం పదవి కట్టబెడతారని వార్తలు వస్తున్నాయి. ఉపముఖ్యమంత్రితో పాటు కీలక శాఖలను ఆయనకే ఇస్తారని తెలుస్తోంది. అయితే ఇందుకు శిందే ఒప్పుకుంటారా? లేదా? అనే దానిపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది.

## డేటా ఎంట్రీనే కీలకం..

**మొదటి పేజీ తరువాయి...**

వారికి ఫోన్ కాల్ చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను క్రమబద్ధీకరించుకోవాలని, వారిని అందు బాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయన్నారు. ఈ పాఠశాలలో ఆహారం, పరిశుభ్రతపై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టికి సాధించిందని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ. ప్రణాళిక రూపొందించ చడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

# మెట్రో రైల్‌ను పటాన్‌చెరు నుంచి ఇస్నాపూర్ వరకు పొడిగించాలని వెల్లువెత్తుతున్న విజ్ఞప్తులు



**మొదటి పేజీ తరువాయి...**

మెడికల్ కాలేజీలు రావడం, గీతం యూనివర్సిటీ రుద్రారంలో ఉండడం, పాశ మైలారం పెద్ద పారుశ్రామిక ప్రాంతంగా రూపాంతరం చందడం, ముల్టీప్లెక్స్ కాంప్లెక్సులు, అపార్ట్మెంట్లు, ఇండిపెండెంట్ ఇండ్లు రావడం, దాదాపు 300 కాలనీలు ఏర్పాటు కావడం, ఉద్యోగ ఉపాధి రీత్యా దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు తరలివచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవడం, పారిశ్రామిక ప్రాంతాలుగా వృద్ధి చెందుతుండడంతో ఆయా పరిశ్రమలకు శ్రామికులను చేర వేయడానికి కొన్నివేల ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు నిత్యం ప్రయాణాలు సాగిస్తుండటం తో జాతీయ రహదారి 65 జనంతో కిక్కిరిసి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. దానికి తోడు జాతీయ రహదారి 65 రుద్రారం లో కేంద్ర శాస్త్ర,సాంకేతిక విజ్ఞాన సంస్థ అయిన ఐ.ఐ.టి ఉండడం, జాతీయ రహదారి పై రెండు అంతర్జాతీయ ఫ్లైఓవర్ల ను ఏర్పాటు చేయడంతో ఒకవైపు రుద్రారం నుంచి ముంబై నాందేడ్ హైవే ని కలపడం, రెండో వైపు హైదరాబాదు నుంచి పూనా, ముంబాయి, పూనా తో పాటు కర్ణాటక లోని ప్రాంత నాందేడ్ తదితర పట్టణాలతో జాతీయరహదారి 24 గంటలు రాత్రి అనకా, పగలనక భారీ వాహనాలతోపాటు, అతి భారీ వాహనాలు ప్రయాణాలు సాగిస్తుండడం, దానికి తోడు వ్యాపార రీత్యా, నిత్యం అంతర్జాతీయ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలు వ్యాపారరీత్యా అను నిత్యం హైదరాబాదుకు రాకపోకలు సాగిస్తున్నాడం, ముత్తంగి జంక్షన్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పడడంతో ట్రాఫిక్ సమస్యలు వర్ణనాతీతం. అందువల్ల పటాన్ చెరువు నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు పొడిగింపు పై వస్తున్న విజ్ఞప్తిలకు ప్రభాత సూర్యుడు పత్రిక సైతం సంపూర్తిగా స్వాగతిస్తున్నది. అతి తొందరలో మియాపూర్ నుంచి మెట్రో రైల్ పొడగింపు పనులు ప్రారంభమవుతున్నాయి కాబట్టి స్థానిక పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు, శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలు ఏకమై పటాన్ చెరువు నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైల్ పొడిగింపును మరో ఉద్యమ కార్యరూపానికి తెర లేపి ఉద్యమిస్తే నే తప్ప ఇస్నాపూర్ వరకు మెట్రో వచ్చే పరిస్థితులు కనపడటం లేవు. అందువల్ల సిపిఐ, సిపిఎం, బిజెపి, బి ఆర్ ఎస్ కార్మిక సంఘాల యూనియన్లు, ఇతర ప్రజా సంఘాల, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, మహిళ సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, ఇతర రాష్ట్రాల, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వేలాది మంది నివాసం ఉంటున్న వారు సైతం పఠాన్ చెరువు నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు ను పొడిగించాలని ఉద్యమిస్తేనే తప్ప మెట్రో వచ్చే పరిస్థితులు దరిదాపులో కనబడుట లేదని పార్టీలు గుర్తిస్తే మంచిది. మరో మెట్రో రైలు సాధన ఉద్యమంలో ప్రభాత సూర్యుడు పత్రిక సైతం భాగస్వామ్యం పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నది.

## పటాన్‌చెరు నుంచి ఇస్నాపూర్‌కు మెట్రో రైల్ పొడగింపు జరగాల్సిందే



పటాన్చెరువు నుంచి మెట్రో రైలు ను ఇస్నాపూర్ వరకు పొడిగించాల్సిన అవసరము ఎంతైనా ఉన్నదని రాష్ట్ర మాదిగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గడ్డ యాదయ్య అన్నారు. ఆదివారం ప్రభాత సూర్యుడుతో మాట్లాడుతూ రుద్రారం, ముత్తంగి, ఇస్నాపూర్ లు తక్కువ కాలంలో ఊహకుఅందనంత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. రుద్రారం లో గీతం యూనివర్సిటీ, కేంద్ర విద్యా వైజ్ఞానిక సాంకేతిక సంస్థ అయిన ఐఐటి ఉండడం చుట్టూ మెడికల్ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలు ఉండడంతో విద్యార్థులు ట్రాఫిక్ సమస్యలతో, సకాలంలో ఆయా కాలేజీలకు చేరుకోలేకపోతున్నారని అన్నారు. దానికి తోడు పాశమైలారం పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా వెలువడం తో కార్మికులతో ఇస్నాపూర్, ముత్తంగి ప్రాంతాలు ప్రజలతో కిటకిటలాడుతున్నాయని అన్నారు. అతి ముఖ్యమైనది ముత్తంగి జంక్షన్లో ఔటర్ రింగ్ రోడ్డు రావడంతో అంతరాష్ట్రల నుంచి భారీ నుండి అతి భారీ వాహనాలు రాత్రింబవళ్లు వస్తున్నడంతో ట్రాఫిక్ సమస్యలు విపరీతంగా పెరుగుతున్నాయి అని అన్నారు. పెట్రో రైలు ను పొడిగించకా తప్పదని అన్నారు.

**గడ్డ యాదయ్య మాదిగ**
**వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం- TMSS**

## అన్ని అర్హతలు ఉన్న ఇస్నాపూర్‌కు మెట్రో రైల్ రావాల్సిందే



అన్ని అర్హతలు ఉన్న ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు రావాల్సిందేనని పటాన్ చెరువు మండల మైనార్టీ నాయకుడు ఎండి ఆబిద్ అన్నాడు. ఆదివారం ప్రభాకర్ సూర్యుడుతో మాట్లాడుతూ ఇస్నాపూర్, ముత్తంగి, రుద్రారంలను చూస్తే ఇదొక మినీ ఇండియా లాగ ఉంటుందని అన్నారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉండడం వల్ల భిన్నత్వంలో ఏకత్వం లాగా మతసా మరస్యాన్ని కాపాడుకుంటూ అన్న తమ్ముల లాగా జీవిస్తున్న ప్రాంతాలని అన్నారు. ఇక్కడి ట్రాఫిక్ సమస్యలు తొలగాలంటే మెట్రో రైలు రావాల్సిందేనని అన్నారు. ప్రజలతో కిక్కిరిసి ఉన్న ప్రాంతం ఇస్నాపూర్ అని అన్నారు.

**పటాన్ చెరువు మండల**
**మైనారిటీ నాయకుడు ఎండి ఆబిద్**

## ఇస్నాపూర్ పై వివక్ష చూపొద్దు




పటాన్చెరువు నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును ఖచ్చితంగా పొడుగించాల్సిందేనని బహుజన సమాజ్ పార్టీ పటాన్ చెరువు నియోజకవర్గం ఉపాధ్యక్షుడు నర్సింగరావు అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమల తో దేశంలోనే పాశ మైలారం కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది అన్న సంగతి పాలకులు మర్చిపోవడం శోషనీయం అని అన్నారు. విద్యాసంస్థలతో, పరిశ్రమల తో విరాజిల్లుతున్న ప్రాంతం ఇస్నాపూర్, ముత్తంగి, రుద్రారం ప్రాంతాలు అన్న విషయం గుర్తించాలని అన్నారు. బేష జాలాలకు పోకుండా,3 ప్రాంతాలలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకత్రాటి పైకి రావలసిన అవసరం ఉన్నదని అన్నారు. బహుజన సమాజ్ పార్టీ సైతం ఈ విషయంలో వెనుకడుగు వేసేదే లేదని అన్నారు.అవసరం అనుకుంటే బి ఎస్ పి పార్టీ ఒక్క అడుగు ముందు కేసి అఖిలపక్ష సమావేశమును ఏర్పాటు చేసి ఉమ్మడి కార్యాచరణ కు తమ పార్టీ పెద్దలతో చర్చించి మెట్రో రైల్ ను ఇస్నాపూర్ వరకు పొడిగించే విధంగా వివిధ రూపాలలో ఉద్యమిస్తామని అన్నారు.

**పటాన్చెరు నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ**
**ఉపాధ్యక్షుడు నర్సింగ్ రావు**

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# లంచం కేసుపై వివరణ ఇవ్వండి

## గౌతమ్ అదానీ, సాగర్ అదానీకి ఎస్ఈసీ ఆదేశం



**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** సోలార్ ప్రాజెక్టులు దక్కించుకోవడానికి లంచాలు ఇచ్చినట్టు అమెరికాలో నమోదైన కేసుపై వివరణ ఇవ్వాలని యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్‌లకు సమన్లు పంపింది. సోలార్ ప్రాజెక్టుల కోసం మనదేశంలోని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు 265 మిలియన్లు (రూ. 2,200 కోట్లు) లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించినట్టు కేసు నమోదయింది. అహ్మదాబాద్‌లోని అదానీ శాంతివన్ ఫార్మ్ నివాసానికి, అదే నగరంలోని ఆయన మేనల్లుడు సాగర్ బోడక్‌దేవ్ నివాసానికి సమన్లు వచ్చాయి. సమాధానం ఇవ్వడానికి 21 రోజుల గడువు ఉంటుంది. న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ద్వారా నవంబర్ 21న నోటీసులు వెళ్లాయి. నోటీసులకు స్పందించడంలో విఫలమైతే తీర్పు వ్యతిరేకంగా ఉండొచ్చని కమిషన్ హెచ్చరించింది. కోర్టులో కూడా వివరణ దాఖలు చేయాలని ఎస్ఈసీ స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే, అదానీ గ్రూపునకు చెందిన 11 లిస్టెడ్ కంపెనీలతో ఏ ఒక్కటీ తప్పు చేయలేదని సంస్థ సీఎఫ్ఓ జుగేషిందర్ రాబీ సింగ్ అన్నారు. ఏ ఒక్క కంపెనీపైనా అమెరికాలో కేసు ఉండబోదని స్పష్టం చేశారు.

# 29న విశాఖకు ప్రధాని రాక

## పర్యటనపై అధికారుల సమీక్ష



విశాఖపట్టణం, నవంబర్ 24 ఈ నెల 29వ తేదీన దేశ ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన దాదాపు ఖరారైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి కలెక్టరేట్ మీటింగు హాలులో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రోడ్ షో నిర్వహణ, ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో సభ నిర్వహణ, ప్రజల సీటింగ్ ఏర్పాట్లు, రవాణా సదుపాయం తదితర అంశాలపై విశాఖపట్టణం ఎంపీ ఎం. శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే వీఐపీల రాక, ప్రధాన మంత్రికి స్వాగతం ఏర్పాట్లు, రోడ్ షో, ప్రజలకు తాగునీరు, ఆహారం, ఇతర కనీస వసతుల కల్పన తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించిన అంశాలపై ముందుగా జిల్లా కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర గవర్నర్, ఉప ముఖ్యమంత్రి వస్తున్నారని, వారు ఉండేందుకు బస ఏర్పాట్లను వెల్లడించారు. గవర్నర్ నోవొటెల్, ముఖ్యమంత్రి పోర్టు గెస్ట్ హౌస్ లో ఉండేందుకు ప్రాథమికంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం ప్రధాన మంత్రి ఐఎన్ఎస్ దేగాకు చేరుకొని అక్కడ నుంచి రోడ్డు మార్గం లేదా వాయు మార్గం ద్వారా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుంటారని, అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారని వివరించారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, పూర్తైన ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఎయిర్ పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా వచ్చినట్లయితే టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు ప్రధాని రోడ్ షో ఉండొచ్చని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రాథమికంగా జిల్లా యంత్రాంగం నుంచి చర్యలు చేపడతున్నట్లు ప్రజా ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

ప్రధాని పర్యటన షెడ్యూల్, ప్రాథమిక షెడ్యూల్ ప్రకారం విశాఖపట్టణం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే బహిరంగ సభ, రోడ్ షో పర్యటన సందర్భంగా ఈ నెల 29వ తేదీ సాయంత్రం 3.40 గంటలకు వాయు మార్గం ద్వారా ఐఎన్ఎస్ దేగాకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా కాన్వెంట్ జంక్షన్, రైల్వే స్టేషన్, సంపత్ వినాయక్ టెంపుల్, టైకూన్, సిరిపురం జంక్షన్ మీదుగా ఎస్పీ బంగ్లా రోడ్డు నుంచి ప్రధాన వేదిక వద్దకు 4.40 గంటలకు వస్తారు. ఈ క్రమంలో టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు 500 మీటర్ల మేర రోడ్ షో నిర్వహిస్తారు. ప్రజలకు అభివాదం చేసుకుంటూ ప్రధాని బహిరంగ సభకు చేరుకుంటారు. అక్కడ నిర్దేశించి కార్యక్రమంలో 4.45 నుంచి 5.00 గంటల వరకు రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో కలిసి వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రసంగాల అనంతరం 5.25 నుంచి 5.43 గంటలకు ప్రధాన మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. తదుపరి 5.45 గంటలకు సభా వేదిక నుంచి ఎయిర్ పోర్టుకు తిరుగుపయనమవుతారు. ఈ సమీక్షలో పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాధుర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



## కల్లూరు మండల కర్యాలయంలో కుల గణనలో స్వీకరించిన

# డేటాని ఆన్లైన్ చేస్తున్న సిబ్బంది

**కల్లూరు–ప్రభాత సూర్యుడు:** ఎంపీడీఓ ఆఫీస్ లో ప్రారంభం అయిన తెలంగాణా సామాజిక, ఆర్థిక కుల గణన కంప్యూటీకరణ ప్రక్రియ. కల్లూరు రెవిన్యూ యంత్రాగం వారి సలహాలు మరియు చూచన లతో ఆన్లైన్ చేస్తున్న కంప్యూటర్ సిబ్బంది. కుల గణన సర్వే లను ఆన్లైన్ చెయ్యడానికి ఇంకా ఎవరైనా ఆసక్తి కలిగి, ల్యాప్ ట్యాప్‌లు కలిగి నిరుద్యోగ యూవతి యూవకులు ఉంటే వెంటనే కల్లూరు ఎంపీడీఓ ఆఫీస్ కి రావాలని కోరారు వారికీ గవర్నమెంట్ వారి ద్వారా వచ్చే గౌరవ వేతనం ఇస్తారు అని ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈ ప్రకటన లో తెలియచేసారు. ఈ కార్యక్రమం లో కల్లూరు రెవిన్యూ మరియు పంచాయతీ యంత్రంగం పాల్గొన్నారు.



# కల్లూరులో వందేళ్ళ భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం నమోదు

**కల్లూరు –ప్రభాత సూర్యుడు:** మండలంలో గల మార్కెట్ కమిటీ ఆవరణలో వందేళ్ళ భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం జరిగింది. సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు అధ్యక్షతన కార్మిక సంఘాలు సిపిఐ ప్రజాసంఘాల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా పార్టీ కార్యదర్శి పోటు ప్రసాద్. జిల్లా పార్టీ కార్యదర్శి మాట్లాడుతూ కార్మిక సంఘాలకు అండగా సిపిఐ పార్టీ నిరంతరం ప్రజా సమస్యలకు పరిష్కారం కోసం అండగా ఉంటుందని ఆయన అన్నారు. శత వసంతాలు పురస్కరించుకొని కార్మిక సంఘాలు పార్టీ సభ్యుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ఆవిర్భావ నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ ఎన్నో హక్కులు సాధనకు కృషి చేసిన పార్టీ అని వివరించారు. ఆ విధంగా వందేళ్ళ చరిత్ర కలిగిన పార్టీ అనుబంధంగా ఉన్న ఏఐటియుసి ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో అనేక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నది ఏఐటీయూసీ కార్మిక సంఘం అని అన్నారు ఈ సందర్భంగా పలు కార్మిక సంఘాలు సభ్యులు పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, బికేఎంయు వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు వేము రాంబాబు ,నిమ్మటూరి రామకృష్ణ ,పిల్లి భాస్కర్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షు లు రాజశేఖర్, కార్యదర్శి మల్లేష్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పాగా సత్యవతి ,స్వీపర్సు యూనియన్ అధ్యక్షులు మలేఖ, ఆసుపత్రి కార్మిక యూనియన్ నాయకులు వంశి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అబద్ధాలు చెప్పడంలో సీఎం

# రేవంత్‌కు PHD ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి...



పోలీసులతో దాడి చేసి లాఠీ చార్జ్ చేయించారని ఫైర్ అయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి దళితులకు చేసే మేలు ఇదేనా అని ప్రశ్నించారు. ఇప్పటికే విడుదలైన దళిత బంధు డబ్బులను వాళ్లకు అందించాలని డిమాండ్ చేశారు. 2024, జులై 19న లగచర్లలో ఫార్మాసిటీ అంటూ ప్రభుత్వం గెజిట్ ఇచ్చింది.. కానీ లగచర్లలో ఫార్మాసిటీ కాదు ఇండస్ట్రియల్ కారిడార్ అంటూ ఇప్పుడు సీఎం మాట మార్చాడు.. ఇప్పుడు నీవు ఇచ్చిన గెజిట్‌పైనే అబద్ధాలు ఆడుతున్నావని విమర్శించారు. ప్రజలకు క్షమాపణ చెప్పి ఆ గెజిట్ వెనక్కి తీసుకున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించాలని.. ఆ జీవో రద్దు చేసి కొత్త గెజిట్ ఇస్తేనే ప్రజలు నమ్ముతారని అన్నారు.ల గచర్లలో పచ్చని పంటలు పండే భూములను తొండలు గుడ్డు పెట్టని భూములుగా రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కూలిపోయిందని చెబుతున్న ప్రభుత్వం.. 20 టీఎంసీల నీటిని అదే ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌కు ఎలా తీసుకోస్తోందని నిలదీశారు. మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగం కాదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 39 కాంపోనెంట్లలో మేడిగడ్డ అనేది ఒక కాంపోనెంట్ మాత్రమేనని.. అందులో రెండు పిల్లర్లకు మాత్రమే డామేజ్ జరిగిందని.. కానీ దీన్ని కొండంత చేసి గోబెల్ ప్రచారం చేశారని సీరియస్ అయ్యారు. హుజురాబాద్‌లో దళిత సోదరులపై పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తున్నామని.. దళిత బంధు అకౌంట్‌ల ఫ్రీజింగ్ ఎత్తివేసి వారికి డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9 నుంచి జరిగే అసెంబ్లీలో దళితుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు.

# ఈ రోజు ఎంతో ప్రత్యేకం

మొదటి పేజీ తరువాయి...

విశ్వాసంతో ఈ మాట మీకు చెబుతున్నాను. యువతలో క్రమశిక్షణ, సేవా గుణాన్ని, నాయకత్వ లక్షణాలను మరింత పెంపొందించడంలో దీని పాత్ర కీలకం" అని ప్రధాని వ్యాఖ్యానించారు. గయానాలో తన పర్యటన గురించి మోదీ ప్రస్తావించారు. "భారత్‌కు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న గయానాలో ఒక మినీ భారత్ ఉంది. కూలీ పనుల కోసం 180 ఏళ్ల క్రితం ఎంతోమంది భారతీయులను అక్కడికి తీసుకెళ్లారు. అయితే.. నేడు విద్య, రాజకీయాలు, సంస్కృతి, వ్యాపారం ఇలా ఎన్నో రంగాల్లో భారత మూలాలున్న వ్యక్తులు తమదైన ముద్ర వేస్తున్నారు. ఆయా రంగాల్లో నాయకత్వం వహిస్తున్నారు. గయానా అధ్యక్షుడు మహమ్మద్ ఇర్ఫాన్ అలీ కూడా భారత్ సంతతి వ్యక్తే. దేశ వారసత్వం పట్ల గర్వపడేలా చేస్తున్నారు" అని కొనియాడారు. "మరోవైపు, స్లోవేకియాలో కూడా భారత్ సంస్కృతి పరిరక్షణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మన ఉపనిషత్తులు తొలిసారిగా వారి భాషలోకి అనువాదం జరిగాయి. ఈ ప్రయత్నాలు ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతి ప్రభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కోట్లాది మంది హృదయాల్లో మన దేశ సంస్కృతి సంప్రదాయాల పట్ల ఉన్న అభిమానం మనందరికీ గర్వకారణం" అని పేర్కొన్నారు.



# ఘనంగా గౌడ సంఘం వనభోజనాలు

**చిలుకూరు (ప్రభాత సూర్యుడు)** మండల కేంద్రం చిలుకూరులో ఆదివారం గౌడ సంఘం వనభోజనాలను ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా గ్రామంలో ముందుగా ర్యాలీ నిర్వహించారు. గ్రామ శివారులోని తోటలో ఉసిరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గౌడ సంఘం కు చెందిన పలువురు పీటల మీద కూర్చుని సత్యనారాయణ వ్రతం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఐక్యంగా గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పేద గౌడ సంఘాలకు చేయూతనివ్వాలని అన్నారు. కార్తీక వనభోజనాల సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గుండు వెంకటేశ్వర్లు, కడియాల వెంకటేశ్వర్లు, కొండా కోటయ్య, మండవ ఉపేందర్, కొండా ఎంకయ్య, గౌడ సంఘం కుటుంబ సభ్యులు, వివిధ స్థాయి ఉద్యోగులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

## రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి

**అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు:** డిసెంబర్ 26న నిర్వహించబోయే సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి పిలుపునిచ్చారు. మండల పరిధి కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, మండల కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎందరో అమరవీరుల త్యాగాలతో శ్రామిక రాజ్య నిర్మాణానికై ఏర్పాటైన సిపిఐ పార్టీ వచ్చే డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని అన్నారు. పార్టీ ఆశయాల సాధనకై ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సిపిఐ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహించబోయే ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రతివొక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్ర్యమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, కేతరాజు నర్సింహా, దిగోజు వేణుగోపాల్, కాటి అరుణ, వట్టి నవనీత తగిలి మధు, మండల కార్యవర్గ సభ్యులు యేశాల నర్సింహా, నారాయణ రెడ్డి, పుల్లయ్య, నారాయణ, రాజు గౌడ్, డొల రాములు, ఆమనగంటి వెంకన్న, ఈశ్వరయ్య, నిరంజన్, యాదగిరి, రాముడు, చింత వెంకటేష్, వినోద్, చందన, సుజాత, దేవమ్మ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): భారత దేశ చరిత్రలోనే అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం ఎక్కడా లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన వ్యక్తులను ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తన నివాసంలో జగిత్యాల నియోజకవర్గ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు కులగణన కమిషన్‌కు నివేదిక అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో, బీసీ సంఘాల నాయకులతోనూ ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. జగిత్యాలకు, నాకు ఆత్మీయ అనుబంధం ఉందని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. 2014 లో నిజామాబాద్ ఎంపీగా తాను గెలిచినా, జగిత్యాల ఎమ్మెల్యేగా సంజయ్ కుమార్ ఓడిపోయారని, కానీ పార్టీలకతీతంగా, వచ్చిన తెలంగాణను అభివృద్ధి చేసుకువాలని, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా, అభివృద్ధిలో జగిత్యాల వెనకబడొద్దనే ఆదేశాలను కేసీఆర్ ఇచ్చారని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు.

# స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే?

### ఇంకా పూర్తికాని బీసీ కమిషన అభిప్రాయ సేకరణ.. కొనసాగుతున్న డెడికేటెడ్ కమిషన సమావేశాలు

### కులగణన సర్వేకు న్యాయపరమైన చిక్కులు.. మహారాష్ట్ర ఓటమి నేపథ్యంలో వెనకడుగు

### ప్రతికూల ఫలితాలు వస్తాయనే ఆందోళన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: వచ్చే నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సర్కారు ఘంటాపథంగా చెప్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం వేసిన డెడికేటెడ్ కమిషన్ సమావేశాలు కొనసాగుతుండటం, కులగణన సర్వే ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేకపోవడం, బీసీ కమిషన్ అభిప్రాయ సేకరణ కూడా గడువులోగా పూర్తయ్యేలా కనిపించకపోవటంతో ఎన్నికల వాయిదా అనివార్యంగా కనిపిస్తున్నది. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జరిగిన ఘోర పరాభవ భయంతో ఇప్పట్లో స్థానిక ఎన్నికలకు వెళ్లకపోవడమే ఉత్తమమని కొందరు మంత్రులు, పార్టీ ముఖ్యులు వారిస్తున్నట్టు తెలిసింది.

**తప్పని పరిస్థితుల్లో డెడికేటెడ్ కమిషన్**

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన కాం గ్రెస్..ఈ దిశగా చర్యలు చేపట్టలేదు. ఓ దశలో రిజర్వేషన్లు ఇవ్వకుండానే పాత విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ వర్గాల





మంత్రులు, ఎమ్మెల్యేలు అభ్యంతరం చెప్పడంతోపాటు బీసీ సంఘాల నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది బలహీనవర్గాలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టులోనూ పిటిషన్లు వేశారు. కోర్టు కూడా రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధిని శంకించడంతో ఎన్నికల నిర్వహణ కు వెనుకడుగు వేసింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్లు తేల్చిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పింది. బీసీ కమిషన్‌నే డెడికేటెడ్ కమిషన్‌గా గుర్తించాలని కోర్టు దృష్టికి తీసుకెళ్లగా అంగీకరించలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో నవంబర్ 4న డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం కమిషన్ జిల్లాల్లో పర్యటిస్తూ వివరాలు సేకరిస్తున్నది. పూర్తిచేసి సర్కారుకు నివేదిక అందించాలంటే మరో నెల రోజులు పట్టవచ్చని అధికారులు చెప్తున్నారు.

**కోర్టులో కులగణన సర్వే చెల్లుబాటు డౌటే !**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్ల అమలుతోపాటు సామాజిక వర్గాల లెక్క తేల్చాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందులో భాగంగా నవంబర్ 6 నుంచి కులగణనను ప్రారంభించింది. ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని అధికారులకు నిర్దేశించింది. సర్వే ఆశించిన మేర ముందుకుసాగడం లేదు. ఇంటింటికి వెళ్లి వివరాల సేకరణ పూర్తి చేయాలంటే మరో 10 రోజులకుపైగా పట్టే అవకాశమున్నది. సేకరణ పూర్తయినా ఆన్‌లైన్ చేసేందుకు మరో 20 రోజులు గడువు అవసరమని అధికారులు చెప్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయినా కోర్టులో నిలిచే అవకాశం లేదని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. కులగణనచేసే అధికారం రాష్ట్రాలకు లేదని పేర్కొంటున్నారు. సుప్రీం కోర్టు నిర్దేశించిన మేరకు ట్రిపుల్ టెస్ట్ పాస్‌కావాల్సి ఉంటుందని చెప్తున్నారు. గతంలో మహారాష్ట్ర, కర్ణాటక, బీహార్‌లోనూ కులగణన చేపట్టినా కేంద్రం ఒప్పుకోలేదని ఉదహరిస్తున్నారు. రాష్ట్రంలోనూ కులగణన సర్వే కోర్టులో చెల్లుబాటయ్యే పరిస్థితి ఉండదని విస్పష్టంగా చెప్తున్నారు.

**మహారాష్ట్రలో పరాభవంతో వెనుకడుగు..**

మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాభవంతో తెలంగాణలో స్థానిక ఎన్నికలపైనా ఆ ప్రభావం పడుతుందని భావించిన పలువురు మంత్రులు, పార్టీ ముఖ్యులు ఇప్పట్లో ఎన్నికలు వద్దని వారిస్తున్నట్టు తెలిసింది. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పెద్దలతోపాటు సీఎం రేవంత్, పలువురు మంత్రు లు తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని ఊదరగొట్టినా అక్కడి జనం నమ్మలేదు. ఇక్కడా రేవంత్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైంది. నిధుల కొరతను సాకుగా చూపుతూ పథకాలన్నీ పక్కనబెడుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం అంతమంచిది కాదని పార్టీ నాయకులు అభిప్రాయ పడుతున్నారు. స్థానిక ఎన్నికలు నిర్వహించి లేనితలనొప్పిని తెచ్చుకోవడం ఎందుకని యోచిస్తున్నట్టు తెలిసింది.

# డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ!



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తెలంగాణ ఇచ్చిన పార్టీ అయినప్పటికీ.. పదేళ్ల విరామం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని ఆహ్వానించాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు అదే అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం. గత సంవత్సరం డిసెంబర్ 7న ఎల్బీస్టేడియంలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి సోనియా, రాహుల్, ప్రియాంక హాజరయ్యారు. ఇప్పుడు కూడా వారినే ఆహ్వానించాలని భావిస్తున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ముందు ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహావిష్కరణను ఘనంగా నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సోనియా గాంధీ చేతుల మీదుగా ఆవిష్కరించాలని భావిస్తున్నారు. ఆ తర్వాత సభ నిర్వహించే అవకాశం ఉంది. " సీఎం రేవంత్ రెడ్డికి షాకిచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యే" అలాగే ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో స్క్రీన్లు కూడా ఏర్పాటు చేయనున్నారు. సోనియా గాంధీ అనారోగ్యం కారణంగా ఇక్కడి వస్తారో లేదో ఇంకా క్లారిటీ రాలేదు. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలను ఆహ్వానించడానికి సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లే అవకాశం ఉంది. శనివారం సీఎం రేవంత్ రెడ్డి సచివాలయం వద్ద జరుగుతున్న తెలంగాణ తల్లి పనులను పరిశీలించారు. కూలీలతో అప్యాయంగా మాట్లాడారు. పనులు జరుగుతున్న తీరు, ఇతర వివరాలు అడిగారు. కాగా డిసెంబర్ 9కి ఒక ప్రత్యేకత ఉంది. ఆ రోజు తెలంగాణ ప్రకటిస్తూ 2009 డిసెంబర్ 9న యూపీఏ ప్రకటన చేసింది. అది కాకుండా ఆ రోజు సోనియా గాంధీ పుట్టిన రోజు కూడా. అందుకే డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేయాలని నిర్ణయించారు.

# లగచర్ల ఘటన.. రంగంలోకి నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ బృందం

## జైల్లో రైతులను కలిసిన సభ్యులు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలువురు రైతుల్ని అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం వారు సంగారెడ్డి జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వీరిని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ బృందం కలిసింది. 8 మంది సభ్యులతో కూడిన బృందం జైలుకు చేరుకొని రైతులతో మాట్లాడారు. ఈ కేసులో నిందితుడు సురేష్ సహా 19 మంది నిందితులు సంగారెడ్డి జిల్లా జైలులో ఉండగా.. వారిని కలిశారు. శనివారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న 8 మంది సభ్యులతో కూడిన బృందం.. ఈ రోజు ఉదయం నేరుగా సంగారెడ్డి జైలుకు వెళ్లింది. అక్కడ ఖైదీలుగా ఉన్న రైతులను కలిసి... లగచర్ల ఘటనలో ఏం జరిగిందో వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ను అక్కడి రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 11న భూసేకరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం వికారాబాద్ కలెక్టర్ సహా.. ఇతర అధికారులు గ్రామానికి చేరుకోగా వారిపై రైతులు దాడికి పాల్పడ్డారు. కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. కలెక్టర్ సహా.. ఇతర అధికారుల వాహనాలు ధ్వంసం అయ్యాయి. ఘటనపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయగా.. వీడియోలో ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. మరుసటి రోజు రాత్రి తండాల్లోకి వెళ్లిన పోలీసులు రైతులను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం19 మంది రైతులను కోర్టులో హాజరు పరచగా.. వారికి రిమాండ్ విధించారు. ప్రస్తుతం సంగారెడ్డి జైలులో రైతులు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. అయితే రైతుల అరెస్టుల సమయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని పలువురు %చీఎ=జ%కి ఆశ్రయించారు. కుట్రపూరితంగా అమాయకులను అరెస్టు చేశారని ఫిర్యాదు చేశారు. గిరిజనులు, ఆడవారి పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని.. అర్ధరాత్రి ఇండ్లలోకి చొరబడి తమ వారిని అరెస్టు చేశారని పలువురు బాధితులు %చీఎ=జ%ని ఆశ్రయించారు. దీంతో 8 మంది సభ్యులతో జాతీయ మానవ హక్కుల సంఘం ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఘటనపై పూర్తి విచారణ చేసి.. బాధితులకు న్యాయం చేసేందుకు రంగంలోకి దిగింది. కాగా, కుట్రపూరితంగా లగచర్లలో అధికారులపై దాడులకు పాల్పడ్డారని సీఎం రేవంత్ విమర్శించారు. ఈ ఘటనలో ప్రతిపక్షాల కుట్ర ఉందని అన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీలు పట్టడం లేదని.. అక్కడ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అయితే ఈ కేసులో ఏ1 నిందితుడిగా పేర్కొంటూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోంది: వైఎస్ జగన్

### అమ్మకు వందనం, ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు వెంటనే విడుదల చేయాలన్న వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): అమ్మకు వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా వసతి దీవెన డబ్బులు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. నిధులు విడుదలచేయకుండా విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను పిల్లల చదువులకు చెల్లించకపోవడంతో చదువులు మానుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. విద్యార్థులపై కక్షకట్టినట్టు సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. ఒంగోలు జిల్లా జె.పంగులూరులో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, ఫీజులు కట్టలేక పనులకు వెళ్తున్న విద్యార్థి కథనం తనకు ఆవేదన కలిగించిందన్నారు. చంద్రబాబు రాగానే అన్ని రంగాల్లోనూ తిరోగమనమే కనిపిస్తోందన్న జగన్, ముఖ్యంగా విద్యారంగాన్ని దారుణంగా దెబ్బతీశారన్నారు. అమ్మ ఒడిని, ఇంగ్లీష్ మీడియం, 3వ తరగతి నుంచి టోఫెల్, సబ్జెక్టు టీచర్లు, సీబీఎస్ఈ, ఐబీ తొలగించారన్నారు. 8వ తరగతి పిల్లలకు ట్యాబులు, బైజూస్ కంటెంట్, నాడు-నేడు ఇలా అన్నింటినీ రద్దుచేసి 1-12వ తరగతి విద్యార్థులను, వారి తల్లులను దెబ్బతీశారన్నారు. ప్రభుత్వం వచ్చి 5 నెలలు దాటినా పైసా విడుదల చేయలేదు: వసతిదీవెన, విద్యాదీవెన నిలిపేసి డిగ్రీ, ఇంజినీరింగ్, డాక్టర్ చదువులు చదువుతున్నవారినీ తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నారని ఆక్షేపించారు. జనవరి-మార్చి త్రైమాసికానికి సంబంధించి మే నెలలో ఇవ్వాల్సిన ఫీజు మొత్తాన్ని ఎన్నికల పేరుతో ఇవ్వకుండా కూటమి పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేసి ఆపేశారన్నారు. 2 వేల 800 కోట్ల రూపాయలకుపైగా ఫీజులు రీయింబర్స్ నిధులు, మరో రూ.1,100 కోట్లు వసతిదీవెన బకాయిలు కలిపి మొత్తంగా డిసెంబర్ నాటికి 3 వేల 900 కోట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వచ్చి 5 నెలలు దాటినా పైసా విడుదల చేయలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయకూడదని, దీనిపై పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చర్చించాలని వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంపైనా చర్చ జరగాలన్నారు. పార్లమెంట్‌లో అన్ని పార్టీలు చర్చించి డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియా కార్యకర్తలను దారుణంగా హింసిస్తున్నారని ఆరోపించారు.

# రాష్ట్రంలో భారీగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు!



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీ యంగా తగ్గుముఖం పట్టాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హైదరాబాద్ పేర్కొంది. పలు జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 11 డిగ్రీల సెల్సియస్‌కు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. ఉష్ణోగ్రతల తగ్గుదల బుధవారం వరకు కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమురం భీమ్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, సంగారెడ్డి, వరంగల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లో కూడా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. నగర శివారుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడుతుంది. హైదరాబాద్‌లోని మారేడ్‌పల్లిలో అత్యల్పంగా 14.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. పగటి, రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. తెల్లవారుజామున కనిష్ఠంగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. అందుకే రాత్రి సమయంలో అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలని సూచిస్తున్నారు. తెల్లవారుజామున కూడా జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు చలి తీవ్రత కారణంగా ఉదయం వాకింగ్ కు వచ్చే వారి సంఖ్య తగ్గుతోంది. చలితో వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. బయటకు వెళ్లే వారు చెవులకు గాలి తగలకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. మందపాటి దస్తులు ధరించాలని వివరిస్తున్నారు. ముఖ్యంగా అస్తమా ఉన్న వారు చలి కాలం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం తగ్గుతోంది. ఈ వారంలో గతం కనిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు అవుతుంది. మరోవైపు లా నినా పరిస్థితులు ఈ సంవత్సరం భారతదేశానికి అనూహ్యంగా కఠినమైన శీతాకాలాన్ని తీసుకురావచ్చని గతంలో హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఎల్ నినోకు వాతావరణ ప్రతిరూపమైన లా నినా, పసిఫిక్ మహాసముద్రం ఉపరితల జలాల శీతలీకరణను కలిగి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది చల్లని ఉష్ణోగ్రతలతో పాటు ఎక్కువ వర్షపాతం నమోదు కావడానికి కారణం అవుతుందని వివరించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో చలి తీవ్రత ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215